క్లుప్తంగా

మెకానిజంలోనూ శిక్షణ

తిరుపతి అర్బన్: తిరుపతి అలిపిరి డిపోలోని డ్రైవింగ్ స్కూల్‌లో డ్రైవింగ్‌తోపాటు మెకానిజంలోనూ శిక్షణ ఇస్తున్నట్టు స్కూల్ ప్రిన్సిపాల్, డిపో మేనేజర్ సింగం హరిబాబు తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న 20వ బ్యాచ్ వారికి సర్టిఫికెట్లు అందజేశారు. వాటిని ఆర్టీవో కార్యాలయంలో సమర్పిస్తే వారు హెవీ డ్రైవింగ్ లైసెన్స్ ఇస్తారని పేర్కొన్నారు. ఇప్పటి వరకు శిక్షణ పూర్తి చేసుకున్న 320 మందికి హెవీ డ్రైవింగ్ లైసెన్స్ పొందారని వివరించారు. వారిలో పలువురికి స్థానికంగా ఉద్యోగాలు లభించాయని చెప్పారు. 21వ బ్యాచ్‌కు బుధవారం నుంచి శిక్షణ ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. మరోవైపు 22వ బ్యాచ్‌కు దరఖాస్తులు ఇస్తున్నట్లు వెల్లడించారు. ఆర్టీసీ అధికారులు ప్రభాకర్, పుష్పలత పాల్గొన్నారు.

3 వేల మందికి వైద్య పరీక్షలు

భాకరాపేట: ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సహకారంతో చిన్నగొట్టిగల్లు, వలసారెడ్డిగారిపల్లె, టి.కుమ్మరపల్లెలో బుధవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో 3 వేల మంది పరీక్షలు చేయించుకున్నట్లు ఎంపీపీ యుగంధర్‌రెడ్డి, ఎంపీడీఓ దేవేంద్రబాబు తెలిపారు. మండలంలో మొత్తం 16 వేల మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారని.. వీరందరికి వారంలో పరీక్షల రిపోర్టులు వారి ఇంటికి చేరుతాయన్నారు.

విద్యా కానుక పంపిణీ

భాకరాపేట: చిన్నగొట్టిగల్లు హైస్కూల్‌లో బుధవారం జగనన్న విద్యా కానుక కిట్లను ఎంపీపీ యుగంధర్‌రెడ్డి విద్యార్థులకు అందజేశారు. విద్యార్థులు బాగా చదువుకుని మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు స్వరూప, సర్పంచ్ మనోహర్, ఎంఈఓ సత్యనారాయణ, హెచ్‌ఎం నాగరత్నమ్మ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సేవలను మరువలేం

తిరుపతి మంగళం : నగర పరిశుభ్రత కోసం నిరంతరం శ్రమించే పారిశుద్ధ్య కార్మికుల సేవలను మరువలేమని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. బుధవారం పద్మావతిపురంలోని నివాసంలో ఎమ్మెల్యేను సీపీఐ నేతలు తులసేంద్ర తదితరులు ఘనంగా సత్కరించారు. పారిశుద్ధ్య కార్మికులకు ఇంటి స్థలాలు మంజూరు చేయించేందుకు విశేషంగా కృషి చేస్తున్న ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు చెప్పారు. ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి మాట్లాడుతూ సీఎం దృష్టికి తీసుకెళ్లి కార్మికులకు ఇంటి స్థలాల మంజూరు చేయిస్తామని వెల్లడించారు.

తిరుచానూరు సీఐ బాధ్యతల స్వీకరణ

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా శివప్రసాద్ రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ సుబ్రమణ్యంరెడ్డి సాధారణ బదిలీల్లో భాగంగా తిరుపతి రూరల్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. తిరుపతి ఈస్ట్ స్టేషన్ సీఐగా పనిచేస్తున్న శివప్రసాద్ రెడ్డి ఇక్కడికి వచ్చారు. అనంతరం ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మోహిత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

యాసిడ్‌తో దాడిచేసిన మహిళకు జైలు

తిరుపతి లీగల్ : ఓ వ్యక్తిపై యాసిడ్‌తో దాడి చేసిన కేసులో డి.అరుణకుమారికి ఏడాది జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ తిరుపతి అదనపు సీనియర్ సివిల్‌జడ్జి సునీతారాణి బుధవారం తీర్పునిచ్చారు. కోర్టు కానిస్టేబుల్ రమేష్ కథనం మేరకు.. తిరుపతి రూరల్ అవిలాలకు చెందిన డాక్టర్ కళత్తూర్ ఆదర్శ్‌రెడ్డి ప్రస్తుతం హైదారాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో ఆర్థోపెడిక్ డాక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. 2015లో తొండవాడలో ఆశ్రితను వివాహం చేసుకున్నాడు. ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో తిరుపతి ప్రిన్సిపల్ సీనియర్ సివిల్‌జడ్జి కోర్టులో విడాకుల కేసు దాఖలు చేశారు. ఆదర్శ్ రెడ్డి తిరుపతి సాయిరాం వీధిలోని రమాదేవి ఆస్పత్రిలో పని చేసేవారు. అదే సమయంలో నిందితురాలు అరుణకుమారి అక్కడే స్టాఫ్ నర్స్‌గా ఉండేది. ఆదర్శ్‌రెడ్డి తనను వివాహం చేసుకుంటానని చెప్పి మోసం చేశారని అప్పట్లో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ క్రమంలో 2019 ఫిబ్రవరి 7వ తేదీ డాక్టర్ ఆదర్శ్‌రెడ్డి తన తండ్రితో కలిసి తన విడాకుల కేసు వాయిదాకు తిరుపతి కోర్టుకు వచ్చారు. నిందితురాలు అరుణకుమారి అదేరోజు ఉదయం 9.45 గంటలకు బురఖా వేసుకొని వచ్చి కోర్టు సిబ్బంది గది వద్ద నిలబడి ఉన్న ఆదర్శ్‌రెడ్డిపై యాసిడ్‌తో దాడి చేసింది. కేసులో సాక్ష్యాధారాలను పరిశీలించిన కోర్టు అరుణకుమారి జైలు, జరిమానా విధించింది.

రక్తదాతలు.. సమాజ హితులు

- మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత

తిరుపతి తుడా: రక్తదాతలు.. సమాజ సేవకులని, రక్త సేకరణ ఉద్యమ తరహాలో నిరంతర ప్రక్రియగా కొనసాగించాలని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.హరిత అన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని బుధవారం తిరుపతి రుయా బ్లడ్‌బ్యాంక్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆమె మాట్లాడుతూ.. తిరుపతి ప్రముఖ యాత్రాస్థలం కావడంతో యాత్రికులకు సైతం రక్తదానంపై అవగాహన కల్పించి ప్రతి రోజూ శిబిరాలను నిర్వహించాలని సూచించారు. మున్సిపల్ కార్పొరేషన్‌లోనూ తరచూ బ్లడ్ డొనేషన్ క్యాంపులు ఏర్పాటు చేయిస్తామని చెప్పారు. డీఎంహెచ్‌ఓ శ్రీహరి మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా వైద్యులు, వైద్యసిబ్బందితో రక్తదాన కార్యక్రమాలను చేయిస్తున్నట్లు చెప్పారు. రక్తదానంపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. రుయా అభివృద్ధి కమిటీ వర్కింగ్ చైర్మన్ బండ్ల చంద్రశేఖర్ రాయల్, సూపరింటెండెంట్ రవిప్రభు, హెల్త్ ఆఫీసర్ హరికృష్ణ పాల్గొన్నారు.



రక్తదాతను సత్కరిస్తున్న కమిషనర్ హరిత

రక్తదాతలకు సన్మానం

25 కంటే ఎక్కువసార్లు రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లను అందజేసి ఘనంగా సత్కరించారు. తిరుపతికి చెందిన చిరంజీవి ఇప్పటివరకు 70 సార్లు రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచాడు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



క్రికెట్ పోటీల ప్రారంభోత్సవంలో సరదాగా క్రికెట్ ఆడుతున్న ఎమ్మెల్యే భూమన

తిరుపతి ఎడ్యుకేషన్: క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం లభిస్తుందని ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి అన్నారు. ఎస్వీజేఎస్‌ఎం స్కూల్ క్రీడా మైదానంలో బుధవారం పసుపులేటి బుజ్జమ్మ, పసుపులేటి రమేష్‌బాబు మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. క్రీడల ద్వారా ఆరోగ్యం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు అలవడుతాయని తెలిపారు. నిర్వాహకులు పుసుపులేటి రవిశంకర్, సురేష్‌రాయల్, వినోద్‌రాయల్, వినయ్‌రాయల్ మాట్లాడుతూ.. టోర్నమెంట్‌కు ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి 42 జట్లు పాల్గొన్నాయని, ఈ పోటీల్లో విజేత జట్టుకు రూ.లక్ష, రన్నర్ జట్టుకు రూ.50 వేలు ప్రైజ్‌మనీ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు ముద్రనారాయణ, భూమన అభినయ్, కార్పొరేటర్లు ఎస్‌కే బాబు, నరసింహాచారి, లక్ష్మీ వెంకటేష్ పాల్గొన్నారు.

వేడుకగా మండల పూజ





ప్రత్యేక అలంకరణలో గంగమ్మ, పూర్ణాహుతిలో పాల్గొన్న ఎమ్మెల్యే భూమన, ఆలయ చైర్మన్ గోపియాదవ్

తిరుపతి కల్చరల్: శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో బుధవారం మండల పూజ మహోత్సవం వేడుకగా జరిగింది. అమ్మవారికి మహా కుంభాభిషేకం, పునః ప్రతిష్ఠ జరిగి 41 రోజులు పూర్తి కావడంతో అమ్మవారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన యాగశాలలో హోమాలు, కళాన్యాస, మూలమంత్ర అనుష్ఠాన హోమం చేపట్టి పూర్ణాహుతి చేశారు. అనంతరం చిత్రాన్నంను అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. మండల దీక్ష పూజ అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, ఆలయ చైర్మన్ కట్టా గోపి యాదవ్, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

మరింత వేగవంతంగా రీసర్వే

తిరుపతి తుడా: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష రీసర్వే పనులను పక్కాగా నిర్వహించాలని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.హరిత ఆదేశించారు. రీ సర్వేపై కార్పొరేషన్ కార్యాలయంలో బుధవారం అధికారులతో సమీక్షించారు. భూ రీసర్వే పురోగతిపై ఆరా తీశారు. తిరుపతి నగరంలో రీసర్వే పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. కార్పొరేషన్ పరిధిలోని 50 డివిజన్‌ల పరిధిలో 27 స్క్వేయర్ కిలోమీటర్లు, 18 ఎకరాల్లో డ్రోన్ సర్వే పూర్తయిందన్నారు. అంతే వేగంగా మిగిలిన ప్రాంతాల్లోనూ రీసర్వే చేయనున్నట్లు చెప్పారు. సర్వే నంబర్లు, అసెస్‌మెంట్ నంబర్లు, సబ్‌డివిజన్ సక్రమంగా ఉన్నాయా అని మరోసారి తనిఖీలు నిర్వహించాలని అధికారులను ఆదేశించామన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ

తిరుపతి కల్చరల్: పద్మభూషణ్ డాక్టర్ కుమార మంగళం బిర్లా జన్మదినం సందర్భంగా బుధవారం గాంధీరోడ్డులోని కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్ట్ కార్యాలయం వద్ద పేదలకు అన్నదానం, దుస్తులు పంపిణీ చేశారు. ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం ముఖ్య అతిథిగా హాజరై అందజేశారు. ట్రస్ట్ చైర్మన్ పీసీ.రాయులు, డైరెక్టర్ రుద్రరాజు శ్రీదేవి పాల్గొన్నారు.

రోడ్ల అభివృద్ధితో తిరుపతికి కొత్తరూపు

- డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి

తిరుపతి తుడా: తిరుపతి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని నిర్మిస్తున్న మాస్టర్‌ప్లాన్, లింక్‌రోడ్లతో ఆధ్యాత్మిక నగరం కొత్తరూపు సంతరించుకుందని డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి అన్నారు. హీరోహోండా షోరూం–పద్మావతిపురం మాస్టర్‌ప్లాన్ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం పరిశీలించారు. వచ్చే 50 ఏళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మాస్టర్ ప్లాన్ రోడ్లను నిర్మిస్తున్నామని తెలిపారు. ఆయన వెంట డీఈ సంజీవ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటేశ్వరరావు, గణపతి నాయుడు, సోమశేఖర్ ఉన్నారు.



రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ భూమన అభినయ్

కొత్త ప్యాషన్ ప్లస్ 100 సీసీ బైక్ ఆవిష్కరణ

తిరుపతి కల్చరల్: రేణిగుంట రోడ్డులోని గోపాల్ ఆటో మొబైల్స్ షోరూంలో హీరో మోటార్స్ వారి కొత్త ప్యాషన్ ప్లస్ 100 సీసీ ద్విచక్ర వాహనాన్ని బుధవారం ఆవిష్కరించారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, తిరుపతి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఆర్కాట్ కృష్ణప్రసాద్, టీఎస్‌ఎం మహేష్, షోరూం అధినేత దామా గోపాల్ హాజరై బైక్‌ను ఆవిష్కరించారు.



బైక్‌ను ఆవిష్కరిస్తున్న షోరూం అధినేత, అతిథులు

శ్రీచైతన్య విజయకేతనం

తిరుపతి ఎడ్యుకేషన్: ఏపీఈఏపీసెట్ ఫలితాల్లో తిరుపతిలోని శ్రీచైతన్య విద్యాసంస్థల విద్యార్థులు ఇంజినీరింగ్, అగ్రికల్చర్ విభాగాల్లో విజయకేతనం ఎగురవేసినట్లు విద్యాసంస్థ ఏజీఎం బీవీ ప్రసాద్ తెలిపారు. అగ్రికల్చర్‌లో షాజరున్నీసా రాష్ట్ర స్థాయి 58వ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. అలాగే ఎస్.తేజేశ్వర్ 189, రుత్విక్ 217, హర్ష 279, ఈశ్వర్ 285, వైఎస్.శ్రీనివాస్ 334 ర్యాంకులను సాధించినట్లు తెలిపారు.

–అలాగే నీట్ ఫలితాల్లో వి.చరణ్‌పాండియన్ జాతీయస్థాయిలో 52వ ర్యాంకు, ఎస్.హారిక 223, వై.దోనశ్రీ 765, సి.ప్రసూనజాష్మిత 1,159, ఎం.జాహ్నవి 1,756, బి.దీవెన 1,877 ర్యాంకులు సాధించారని తెలిపారు. వారిని ఏజీఎం బీవీ ప్రసాద్, అధ్యాపకులు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఏజీఎం ప్రసాద్

నారాయణ ప్రభంజనం

తిరుపతి ఎడ్యుకేషన్: ఏపీఈఏపీసెట్ ఫలితాల్లో తిరుపతి నారాయణ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. ఇంజినీరింగ్ విభాగంలో చింతపర్తి బాబు సుజన్‌రెడ్డి రాష్ట్ర స్థాయి 4వ ర్యాంకు, పి.శశాంక్‌రెడ్డి 9వ ర్యాంకు, కె.భువనచంద్ర 32వ ర్యాంకు, మిఖిల్‌రెడ్డి 34వ ర్యాంకు, వింధ్య 171, తనుష్‌కుమార్‌రెడ్డి 216, మనోజ్ 220, జస్విన్‌రెడ్డి 225, కృతి 282, హర్షిత 301, అగ్రికల్చర్ విభాగంలో దేవధరున్ 207, కార్తికేయరాయల్ 211, వెంకటరోహిత్ 318, చందన 344, పద్మశ్రీ 376 సాధించినట్లు డీజీఎం కొండలరావు తెలిపారు.



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో డీజీఎం కొండలరావు

–నీట్ ఫలితాల్లో ప్రవీణ్‌కుమార్ 720 మార్కులకు 665మార్కులు, కృష్ణచందన 655, దేవధరుణ్ 646, రెడ్డిశేఖర్ 634, విష్ణువర్ధన్, వెంకటరోహిత్ 630, పద్మశ్రీ 628, కార్తికేయ రాయల్ 620 మార్కులు సాధించినట్లు వెల్లడించారు.

నీట్‌లో డాక్టర్స్ అకాడమీ ప్రతిభ

తిరుపతి ఎడ్యుకేషన్: నీట్ ఫలితాల్లో తిరుపతిలోని డాక్టర్స్ మెడికల్ అకాడమీ విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించినట్లు కళాశాల చైర్మన్ బీవీ కృష్ణారెడ్డి తెలిపారు. మహ్మద్ షరీఫ్ అజం 720 మార్కులకు 680 మార్కులు, వి.వైష్ణవి 646, వి.అర్జున్‌రెడ్డి 632, కె.లీనాసాయి 627, ఎం.విక్రమ్‌నటరాజ్ 621, ఎస్.త్రిలోక్‌రాజు 600 మార్కులు సాధించినట్లు తెలిపారు. విద్యార్థులను వైస్ చైర్మన్ పార్థీవ్‌రెడ్డి, ఏడీ కె.రహీమ్ అభినందించారు.



మహ్మద్ షరీఫ్ అజం, వైష్ణవి, అర్జున్‌రెడ్డి, లీనాసాయి

సత్తాచాటిన అశ్వమేధ

తిరుపతి ఎడ్యుకేషన్: నీట్‌లో తిరుపతిలోని అశ్వమేధ ఐఐటీ–మెడికల్ అకాడమీ విద్యార్థులు సత్తా చాటినట్లు కళాశాల డైరెక్టర్లు అబ్దుల్ ఇశ్రత్, గోవర్ధన్ తెలిపారు. బి.ఉమేష్‌చౌదరి 720 మార్కులకు 647, వి.రుత్వికరెడ్డి 627, బి.హరిహరన్ 626, కె.వర్షారెడ్డి 612, ఎస్‌ఎం.ఉమర్‌సాలిన్ 610, కె.చాతుర్య 600 మార్కులు సాధించినట్లు తెలిపారు. వీరిని ప్రిన్సిపల్స్ భాస్కర్‌రెడ్డి, సుమతి అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్లు

ఎంపీడీఓ బాధ్యతల స్వీకరణ

పాకాల: ఎంపీడీఓగా పీఎంఆర్ ప్రభాకర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. రామసముద్రం ఎంపీడీఓ కార్యాలయంలో ఏఓగా పనిచేస్తున్న ఈయన పదోన్నతిపై పాకాల బదిలీ అయ్యారు. కార్యాలయ సిబ్బంది ఆయనకు శాలువా కప్పి, పుష్ప గుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఇక్కడ ఇన్‌చార్జి ఎంపీడీఓగా పని చేస్తున్న రమేష్‌బాబుకు వీడ్కోల సత్కారం చేశారు.



ప్రభాకర్‌ను సత్కరిస్తున్న కార్యాలయ సిబ్బంది

తోపుడు బండ్ల వ్యాపారుల నిర్వాకం



రోడ్డుపై ఏర్పాటు చేసిన దేవతామూర్తుల విగ్రహాలను చూపుతున్న బీజేపీ నేతలు

తిరుపతి తుడా: తిలక్ రోడ్డులోని శ్రీదేవి కాంప్లెక్స్–మార్కెట్ కూడలి వద్ద అర్ధ రాత్రి తర్వాత టన్నుల కొద్దీ చెత్త పారబోస్తున్నారు. దేవతామూర్తుల ప్రతిమలు పెడితే అక్కడ చెత్త పారబోయరని భావించిన కొందరు చిరు వ్యాపారులు మట్టి ప్రతిమలను తీసుకొచ్చి రోడ్డు వెంబడి పెట్టించారు. ఇందుకు నిరసనగా బీజేపీ నాయకులు బుధవారం ఆందోళనకు దిగారు. సులభ కాంప్లెక్స్ ముందర దేవతామూర్తుల ప్రతిమలు ఎలా పెడతారంటూ ప్రశ్నించారు. వివాదం కావడంతో వాటిని ఏర్పాటు చేసిన చిరు వ్యాపారులే తొలగించారు. మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ఆ ప్రాంతంలో మొక్కల కుండీలను ఏర్పాటు చేశారు.